



మడకశిరలో అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు

నిబంధనలు నిల్.. నొక్కుడు ఫుల్..!

◆ పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కరువు
◆ తప్పుడు రీడింగ్‌లతో దోచుడు ఎక్కువ
◆ ప్రజల జేబులకు చిల్లులు







ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పెట్రోల్ బంకు యాజమాన్యాలు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నాయి. వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. పైగా తప్పుడు రీడింగ్‌లతో నొక్కుడు అధికంగా ఉంటోంది. విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ విచారణల్లోనూ ఇవి తేలాయి. ప్రత్యేకమైన చిప్‌లను ఏర్పాటు చేసి రీడింగ్‌లను ఏ రకంగా జంపింగ్ చేస్తున్నారన్నది తేటతెల్లమైంది. ఇంత జరుగుతున్నా పరిశీలించాల్సిన జిల్లా పౌర సంబంధాల శాఖ మాత్రం మిన్నకుండిపోతోంది. కనీస సౌకర్యాలు కల్పించని పెట్రోల్ బంకుల్లో సరిచేసే చర్యలు తీసుకున్న దాఖాల్లేవు.

నిబంధనలు ఇలా..

నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులోనూ ఆరు రకాల కనీస సౌకర్యాలుండాలి. అందులో మొదటిది వాష్ రూమ్ సౌకర్యం ఉండటం. రెండోది సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించడం. మూడు ఉచితంగా గాలి, ఎమర్జెన్సీ కిట్, ఎమర్జెన్సీ కాల్ సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలో అత్యధికం బంకుల్లో ఇవేవి ఉండటం లేదు. మరుగుదొడ్లు ఉన్నా కొన్నింటికి తాళాలు వేసి ఉండగా మరికొన్నింటికీ అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ఏవైనా లోపాలుంటే ఫిర్యాదు చేయడానికి విధిగా ఫిర్యాదుల బాక్సు ఉండాలి. అవి కూడా ఉండటం లేదు. వీటి నిర్వహణకు పది వేల లీటర్లు విక్రయిస్తే ఆరు వందల రూపాయలు నిర్వహణకు ఖర్చు పెట్టాలి. అదే విధంగా మరుగుదొడ్లు ఇతర నిర్వహణకు రూ.18 వేలు ఖర్చు చేయాలి. అయితే ఇవేవి ఉమ్మడి జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో అమలు జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

నొక్కుడు మాత్రం ఫుల్..!

పెట్రోల్ బంకు యజమానులు మౌలిక సదుపాయల కల్పనపై దృష్టి సారించడం లేదుగాని, నొక్కుడుపై మాత్రం పెద్దఎత్తున దృష్టి సారించారు. రీడింగ్‌ల్లో మైక్రో చిప్‌లు అమర్చి ప్రతి వంద పాయింట్లకు పది పాయింట్లు జంప్ అయ్యేటట్టు అమరుస్తున్నారు. విజిలెన్స్ ఎన్‌పోర్సుమెంట్ ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం స్పష్టమైంది. పెద్దఎత్తున రీడింగుల్లో మోసాలు జరిగినట్టు తేలింది. వీటిపై చర్యలకు ఆదేశించారు. తనిఖీలు నిర్వహించని ఇతర బంకుల్లోనూ ఇదే తరహాలో మోసం జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. వీటిపై ఆయా శాఖల అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తుండటంతోనే ఇంత పెద్దఎత్తున అక్రమాలు జరగడానికి కారణమవుతోందన్న ఆరోపణలున్నాయి.

మహనీయుడు అంబేద్కర్

జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రపంచం గర్వించదగ్గ మహనీయుడు, మేధావి డా॥బిఆర్.అంబేద్కర్ అని పలువురు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా డా॥బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పుట్టపర్తి కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, పెనుకొండలో ఎంపీ బికె.పార్థసారథి, కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. ఆయా ప్రాంతాల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ డా॥బిఆర్.అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలన్నారు. రాజ్యాంగంతో అందరికీ సమాన హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు.

నేరాల నియంత్రణకు పటిష్ట భద్రత

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో జరుగుతున్న సీసీ కెమెరాల ఏర్పాట్లపై సోమవారం వారు సమీక్షించారు. కర్నాటక సరిహద్దుకు ఆనుకొని ఉన్న మడకశిర పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతలో భాగంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ సహకారంతో పట్టణంలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పట్టణ పోలీస్ స్టేషన్‌కు అనుసంధానించారు. సీసీ కెమెరాల పనితీరను పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నర్సింగప్ప, సిఐ పరిశీలించారు. ఎమ్మెల్యే చెప్పిన వెంటనే సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వారిని అభినందించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

శిక్షణ డీఎస్పీ ఉదయపావని



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శిక్షణ డీఎస్పీ ఉదయపావని, అర్బన్ సిఐ నాగేష్‌బాబు

ప్రజాశక్తి-మడకశిర

అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని శిక్షణ డీఎస్పీ ఉదయపావని, అర్బన్ సిఐ నాగేష్‌బాబు సూచించారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అగ్నిమాపక అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా శిక్షణ డీఎస్పీ ఉదయపావని, అర్బన్ సిఐ నాగేష్‌బాబు హాజరై పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఆస్తి, ప్రాణ నష్టం కలుగకుండా చూసుకోవచ్చన్నారు. ముఖ్యంగా వేసవికాలం కావడంతో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రమాదాలు జరగకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అన్నారు. ఒకవేళ అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101 కు సమాచారం ఇస్తే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పి రక్షిస్తారన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగించే పరికరాలను ప్రదర్శనకు ఉంచారు.

కరపత్రాలు ఆవిష్కరణ

హిందూపురం : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు ఆఫ్తాబ్, స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్ సూచించారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో సోమవారం వారు అగ్నిమాపక జాతీయ వారోత్సవాలను ప్రారంభించారు. అలాగే ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14వ తేదీ ముంబై ఓడరేవులోని విక్టోరియా డాక్ యార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బంది 66 మంది మృతిచెందగా, చాలా మంది గాయపడ్డారన్నారు. ఈ సంఘటన గుర్తుగా అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా గృహాలు, కర్మాగారాలు, గోదాములు, గ్యాస్, పందిర్లు, గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాముల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే 101కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలన్నారు. ఇందులో భాగంగా అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్ అగ్ని ప్రమాద సమయంలో ఉపయోగించే పరికరాలు, అవి పని చేసే విధానాలపై వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుకొండ నూతన డీఎస్పీగా నర్సింగప్ప



ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నూతన డీఎస్పీగా నర్సింగప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు బదిలీ కాగా ఆ స్థానంలో నర్సింగప్ప వచ్చారు. ఈయన గతంలో నియోజకవర్గంలోని పెనుకొండ, గోరంట్ల మండలాల్లో ఎస్ఐగా పని చేశారు. నూతన డీఎస్పీకి డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు అభినందనలు తెలిపారు.

మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

సిపిఎం జిల్లా నాయకులు జెడ్‌పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి, మతోన్మాదుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జెడ్‌పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి పురవీధుల గుండా అంబేద్కర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో 'అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందా' అని నినాదాలు చేశారు. అంబేద్కర్ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్‌పి. శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ దేశానికి దశ, దిశ నిర్దేశించిన అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల దేశంలో ప్రజాస్వామ్యం నిలబడిందని, లౌకికదేశంగా కొనసాగుతుందన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి ఓటు హక్కు, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం దక్కాయన్నారు. అలాంటి గొప్ప రాజ్యాంగాన్ని మతోన్మాద బిజెపి ప్రభుత్వం రద్దు చేసి ఆర్ఎస్ ఎస్ మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని చూస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. బిజెపికి అంబేద్కర్ జయంతి నిర్వహించే హక్కు లేదన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఎందుకు రద్దు చేస్తున్నది సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకుపోయి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం, కెవిపిఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, కెవిపిఎస్ నాయకులు

భూమనపై ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రెండు రోజుల నుంచి టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపై కూటమి నాయకులు, టీటీడీ ప్రస్తుత పాలకమండలి చేస్తున్న విమర్శలు అర్థరహితమని వైసిపి యువజన రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పుట్టపర్తి లో విలేకర్లతో మాట్లాడుతూ భూమన కరుణాకర్‌రెడ్డి గతంలో టీటీడీ ఛైర్మెన్ గా ఉన్నప్పుడు పలు సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. గోశాలను అంకితభావంతో నిర్వహించలేక ఒక వైపు గోవులను సరిగా సంరక్షణ చేయలేక వాటి మరణానికి కారణమౌతూ తిరిగి తమనే విమర్శించడం భావ్యం కాదన్నారు. పరిటాల కుటుంబం భూమనను విమర్శించడం బాధాకరమన్నారు. భూమనతో వారికుటుంబానికి ఉన్న సాన్నిహిత్యాన్ని మరిచి పోకూడదన్నారు. తిరుమల ఎంతో పవిత్రమైనదని దానిపై ఎవరు అసత్య ఆరోపణలు చేసిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన తెలిపారు.

ఖాద్రీశుని సేవలో కౌశిక్


కదిరి టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహస్వామిని అనంతపురం డివిజన్ సెంట్రల్ టాక్స్ సూపరింటెండెంట్ కౌశిక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రమేష్, తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన రాగి చెట్టు

చిలమత్తూరు : గాలి వాన కారణంగా మండలంలోని కోడూరులో భారీ పురాతన రాగి చెట్టు సోమవారం నేలకొరిగింది. ఊరిలోకి ప్రవేశద్వారంలో ఉన్న ఈ చెట్టు కూలిపోయింది. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటన గ్రామస్తుల్లో ఆందోళన కలిగించినప్పటికీ, ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కొట్నూరు గ్రామ కంఠం భూమి కబ్జా.!

ప్రధాన రహదారి పక్కన రూ.కోట్లు విలువైన భూమిలో నిర్మాణాలు - నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు



గ్రామ కంఠం స్థలంలో బోర్డును నాటిన మున్సిపల్ అధికారులు (ఫైల్ ఫోటో)



గ్రామ కంఠం స్థలంలో జరిగిన నిర్మాణాలు

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ కంఠం భూమిని గ్రామానికి చెందిన ఉమ్మడి స్థలంగా కేటాయిస్తారు. ఇది గ్రామంలో నివసించడానికి, సామాజిక కార్యక్రమాలు నిర్వహిణకు వినియోగించుకుంటారు. ఇలా గతంలో కొట్నూరు గ్రామానికి కేటాయించిన గ్రామ కంఠం భూమి ఇప్పుడు కబ్జాకు గురైంది. ఈ భూమి ఎక్కడ అంటూ అధికారులే దాని గురించి సర్వే చేయించాల్సిన పరిస్థితి తలెత్తింది. గతంలో సర్వే నెంబర్ 259-1లో ఉన్న సుమారు 1.8 ఎకరాల భూమిని గ్రామ కంఠం కోసం కేటాయించారు. ఈ భూమిలో రహదారి విస్తీర్ణం కోసం, రస్తా కోసం సుమారు 32 సెంట్లు స్థలం పోయింది. మిగిలిన భూమిపై కొంతమంది కన్ను పడింది. కోట్లు విలువ చేసే భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. అవినీతి రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ అండదండలతో విలువైన స్థలం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. గ్రామ కంఠ భూమి అని తెలిసినప్పటికీ రెవెన్యూ అధికారులు ఎంజాయ్మెంట్ పట్టాలు సైతం మంజూరు చేసింది. ఇందులో కొంతమంది పక్కా భవనాలు సైతం నిర్మాణం చేసుకున్నారు. మరి కొంతమంది ఖాళీగానే పెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పులే మున్సిపల్ అధికారులు చేయలేదు. మిగిలిన స్థలాన్ని ఎలాగైనా కాపాడుకోవాలని గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు సర్వే నంబర్ 259-1సి లో ఉన్న 18 సెంట్లు స్థలం పురపాలక సంఘానికి చెందినదిగా గుర్తించి బోర్డుని ఏర్పాటు చేశారు. కమిషనర్ బదిలీ అయ్యేంత వరకు ఆ స్థలం జోలికి ఎవరూ వెళ్లలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కన్ను ఆ స్థలంపై పడింది. దీంతో నాటిన బోర్డును గుట్టు చప్పుడు కాకుండా అక్కడ నుంచి తొలగించారు. ఎలాగైనా ఆ స్థలాన్ని కబ్జా చేసుకోవాలనుకున్న ఆ నాయకుడు గత నెల స్థలంలో షెడ్ల నిర్మాణాలను చేపట్టడానికి పనులను ప్రారంభించారు. దీంతో కొంత మంది మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందికి అక్కడికి పంపించి పనులను ఆపించారు. నెల తిరిగే లోపు మళ్లీ అదే స్థలంలో అదే నాయకుడు షెడ్ల నిర్మాణాలు చేసుకోవడానికి పనులను ప్రారంభించారు. కోట్లు విలువజేసే పురపాలక సంఘానికి చెందిన స్థలంగా గుర్తించిన అధికారులు, వెంటనే స్థలానికి కంచి వేసి స్థలాన్ని తమ ఆధీనంలో తీసుకోవాల్సి ఉంది. ఇలాంటి వేమీ చేపట్టకుండా వదిలివేయడంతో ఆ స్థలం మళ్లీ కబ్జాకు గురైంది. ఈ స్థలంతో పాటు గ్రామ కంఠానికి సంబంధించిన కోట్లు విలువైన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొట్నూరు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలంలోకి

అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని బుగ్గ పల్లి గ్రామానికి చెందిన రామమోహన్ , ఆయన అన్న నీడిమామిడిప్పకు ప్రభుత్వం ఇచ్చిన రెండు సెంట్లు స్థలంలో తమకు హక్కు లేదని గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అడ్డుకుంటున్నారని బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయం ముందు సోమవారం తన గోడును వెల్లబోసుకున్నారు. బాధితుడు రామమోహన్ తెలిపిన వివరాల మేరకు నిడిమడప్ప కు ప్రభుత్వం బుగ్గ పల్లి గ్రామంలో సర్వేనెంబర్ 349 లో 2007 సంవత్సరంలో రెండు సెంట్లు స్థటానికి ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అదే గ్రామానికి చెందిన కొంతమంది తెలుగుదేశం నాయకుల అండతో అది ఫేక్ పట్టా అని అది చెల్లదని, గతంలో పునాదులు వేసిన వాటిని కూడా తొలగించారని బాధితుడు వాపోయాడు. పుట్టు మూగ అయిన నీమిడిమామిడప్ప పేరుమీద ఆర్డిటి సంస్థ ద్వారా లోన్ తీసుకొని 2023 సంవత్సరంలో పునాది వేశామని ఆ పునాదిని పెకిలించి వేశారని వాపోయారు. ఇదే విషయంపై కోర్టుకు వెళ్ళగా కోర్టు తమకు అనుకూలంగా తీర్పు చెబుతూ శాశ్వత హక్కు కల్పిస్తూ ధ్రువీకరించిందని అన్నారు. అయితే ఆ నలుగురు వ్యక్తులు మరి కొంతమంది నీ కలుపుకొని స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదని తమపై దాడులకు దిగుతున్నారని తెలిపారు. ఈ విషయంపై గతంలో తహశీల్దార్, ఆర్డీవో, జేసీకి సైతం ఫిర్యాదు చేశామనివారు పోలీసులకు సిఫారసు చేయగా వారు పట్టించుకోలేదని విమర్శించారు. తమ తల్లి వెంకటలక్ష్మి 85 సంవత్సరాలుకాగా, తండ్రి ముత్యాలప్ప 90 సంవత్సరాలు అని చెప్పారు. తల్లితండ్రి, నిడిమామిడిప్ప ముగ్గురు ఒకే చిన్న ఇంట్లో ఉన్నారని ఇందులో పక్కాగృహం నిర్మించుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటే దీనిని అడ్డుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

మౌలిక వసతులు కల్పించాలి

పాలసముద్రం గుట్టపై గుడిసెల వాసులు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం క్రాస్‌లో జాతీయ రహదారి పక్కన గుట్టపై నిరుపేదలు నివాసం ఉంటున్న కాలనీలో వెంటనే మౌలిక సౌకర్యాలు కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పాలసముద్రం క్రాస్‌లో జాతీయ రహదారి పక్కన గుట్టపై వంద నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఆ కాలనీలో నేటికీ తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు, తదితర మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా కాలనీలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, బాబా, నాగమణి, అంజనమ్మ, వైశాలి, రత్న, వెంకటమ్మ, అనూష, మమత, తదితరులు పాల్గొన్నారు.



పాలసముద్రం క్రాస్‌లో ఉన్న గుట్టపై తాగునీటిపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

చివరి ఆయకట్టుకూ నీరందించడమే లక్ష్యం



లైనింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - కొత్త చెరువు రూరల్

హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులను నింపి చివరి ఆయకట్టు వరకు రైతాంగానికి నీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామ సమీపంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇరిగేషన్ ప్రాజెక్టులకు తిరిగి పెద్దపీట వేసి రైతుల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు జిల్లా వరకు హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వంద రోజుల్లో పూర్తి చేసే విధంగాకార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో సుమారు 68 కిమీ లో వరకు రూ.425 కోట్లతో ఈ లైనింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. లైనింగ్ పనులు పూర్తి చేసుకుంటే ఈ ప్రాంతానికి సుమారు 2800 క్యూసెక్కులు నీరు తీసుకోవచ్చన్నారు. లైనింగ్ పనులు జులై 10 లోపల పూర్తి చేస్తే వచ్చే సెప్టెంబర్ మాసంలో పుట్టపర్తి నియోజకవర్గం లో ఉన్న చెరువులకు నీళ్లు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్సీ తాజా స్వరూప్, ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్ వి ఆర్ ఎండి రాయల్ రఘు, వైస్ ప్రెసిడెంట్ రఘురామరాజు, డైరెక్టర్ కృష్ణయ్య కాంట్రాక్టర్ అనూప్, డి ఎ శ్రీనివాస్, జై ప్రసన్న, మరవ కుంటపల్లి మాజీ సర్పంచి రమేష్ రెడ్డి, కొత్తచెరువు పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ తదితరులతో పాటు కంపెనీ ప్రతినిధులు సయ్యద్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం వలన ఎదురయ్యే సమస్యలపై ప్రజలతో చర్చించడానికి నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి కోరారు. మండల పరిధిలోని మర్రి కొమ్మదిన్నె ఎర్ర వంకల వాండ్లపల్లి , జవుకుల గ్రామాల్లో సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తేదీ శుక్రవారం జవుకుల గ్రామంలో నిర్వహించే సదస్సుకు సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సుకు రైతు సోదరులందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సిఐటియు నాయకులు నాగరాజుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

కేరళీయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో ఎన్నో ఏళ్లుగా సాయి సన్నిధిలో నివాసం ఉంటున్న కేరళ వాసులకు తమిళ ప్రజలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పుట్టపర్తిలో సాయి సన్నిధిలో వివిధ వృత్తులలో జీవిస్తున్న కేరళీయులు, తమిళ ప్రజలకు ఈ నూతన సంవత్సరంలో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కేరళీయులు, తమిళ ప్రజలు వారి సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధి వద్ద నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. సాయంత్రం సంగీత కచేరి నిర్వహించారు.

గంజాయి సరఫరాదారులు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

గంజాయి సరఫరా చేసే నలుగురు వ్యక్తులను అర్సెట్ట చేసి వారి వద్దనుంచి 1.827 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనకల్లు మండలం గోవిందువారిపల్లి రైల్వే బ్రిడ్జ్ దగ్గర వేపచెట్టు కింది గంజాయి సరఫరాదారులు ఐదుగురు ఉన్నట్లు గుర్తించామని ఆసమయంలో పోలీసులను చూసి వారు పారిపోటానికి ప్రయత్నించగా నలుగురుని పట్టుకున్నామన్నారు. వారి చేతిలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. వారి వద్ద నుండి 1827 గ్రాముల గంజాయి, 4 సెల్ ఫోన్లు, 1100 రూపాయల డబ్బులు సీజ్ చేసినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు.

12న ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో పివిఆర్ ఫంక్షన్ హాల్లో మే 12న నిర్వహించే మిస్టర్ ఆంధ్ర క్లాసిక్ స్పోర్ట్స్, బాడీ బిల్డింగ్, మాస్టర్స్ ఛాంపియన్షిప్ 2025 పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో అన్ని జిల్లాలలో నుండి బాడీబిల్డర్లు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి డిస్టిక్ బాడీ బిల్డింగ్, ఫిట్నెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు, లోటస్ జిమ్ నిర్వాహకులు రమేష్, లోటస్ జిప్ సభ్యులు సురేష్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి,హనీస్, అతావుల్లా,అద్నూ, లక్కీ, అబ్దుల్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే , తదితరులు

నేడు టిడిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల కన్వీనర్ మల్లిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఎన్నుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక బసవేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ప్రమాదంపై స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండలంలోని ఓబుళ నాయునిపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంపై అధికారులు స్పందించారు. ఈ ప్రమాదంలో కొల్లి అనిత ఇంట్లో తీవ్ర నష్టం సంభవించింది. ఈ ఘటనపై స్పందించిన మంత్రి సత్య కుమార్ యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ సురేష్ బాబు గ్రామానికి వెళ్లి బాధితురాలుని కలిసి ప్రభుత్వ పరంగా నిత్యావసర సరుకులను అందజేశారు. అదేవిధంగా, అనిత కుమార్తె ఇంజనీరింగ్ పూర్తి చేసిన సంగతి తెలుసుకున్న మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆమెకు తగిన ఉద్యోగ అవకాశాన్ని కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - చిలమత్తూరు

జై భారత్ ఆటో యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు భారీగా హాజరై తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, రామచంద్ర, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల అసోసియేషన్ కమిటీని ధర్మవరంలో సోమవారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి. రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా టీ. గీత, కార్యదర్శిగా కే. నాగభూషణ, సహకార దర్శిగా రమేష్ రెడ్డి, కోశాధికారిగా ఎస్.నాగరాజు, మహిళ కార్యదర్శిగా టి. సునీత, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా విఎల్ సుమన్, లాల్ నాయక్ ను ఎన్నుకున్నారు.

బాలయ్య పిఎల చేతిలో పోలీసులు కీలుబొమ్మలు : వైసిపి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు, బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

పోలీసులు ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎల చేతిలో కీలుబొమ్మలుగా మారారని వైసిపి నాయకులు వేణురెడ్డి విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి రోజునే పోలీసులు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఓ కేసులో బీసీ ఎస్సీ నాయకులను బేడీలు వేసి నడిరోడ్డులో నడిపించి తీసుకెళ్లడం అమానవీయమని,ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. సోమవారం సాయంత్రం వైసిపి నాయకులు, దళిత నాయకులు, అరెస్ట్ కాబడిన బీసీ నాయకుడు వాల్మీకి లోకేష్, దళిత నాయకుడు నవీన్ కుటుంబసభ్యులు చందన లోకేష్, శైలజ నవీన్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. నిజంగా తప్పు చేస్తే చర్యలు తీసుకోవలసిన పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అవమానపరిచే విధంగా నడిరోడ్డులో బేడీలు వేసి పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లడం ఎంతవరకు న్యాయమని అన్నారు. అవమానాన్ని భరించలేక ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే తమ కుటుంబాలకు ఎవరు దిక్కని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్ భార్య చందన మాట్లాడుతూ తన భర్తను పోలీసులు తీసుకెళ్లి రెండు రోజులు అయిందని ఎక్కడ పెట్టారో కూడా తెలియదని ఆవేదన వ్యక్తం చేసింది. నిజంగా తప్పే చేసి ఉంటే కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచాలన్నారు. అలాంటివేమీ చేయకుండా పోలీసులు ఎక్కడెక్కడో దాచి సోమవారం మధ్యాహ్నం బేడీలు వేసుకుని నడిరోడ్డులో నడిపించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి నేత వేణు రెడ్డి, దళిత నాయకులు మాట్లాడుతూ అక్రమంగా కేసులు బనాయించడమే కాకుండా పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని అంబేద్కర్ జయంతి రోజు దళిత, బీసీ కులానికి చెందిన నాయకులను నడిరోడ్డుపై బేడీలతో తీసుకెళ్లడం ఎవరి మెప్పు కోసమని ప్రశ్నించారు. హిందూపురం నియోజకవర్గం లో పోలీసులు బాలయ్య పిఎ ల చేతిలో కీలుబొమ్మల వ్యవహరిస్తున్నారన్నారు. వాస్తవానికి మోహన్ అనే వ్యక్తిపై కొంతమంది మద్యం సేవిస్తూ బార్ లో దాడులు చేసుకున్నారు. ఈ దాడికి ఎటువంటి సంబంధం లేకపోయినా వాల్మీకి లోకేష్, దళిత నాయకుడు నవీన్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా మంగళవారం అంబేద్కర్ సర్కిల్ నుండి వన్ టౌన్ స్టేషన్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి, స్టేషన్ ముందు ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ ధర్నాకు వైసీపీ నాయకులతో పాటు బీసీ, దళిత నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లతో పాటు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు ఆదర్శనీయం



పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర



చిన్నారులతో కలసి అంబేద్కర్ జయంతిని జరుపుకుంటున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



మడకశిరలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు న్యాయం కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కొనియాడారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి పురస్కరించుకొని బాలుర వసతిగృహంలో సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి అధికారులు ప్రజా సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డి ఆర్ డి ఏ పిడి నరసయ్య, ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి.రత్న పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచానికి స్ఫూర్తి భారత రాజ్యాంగం అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు , మహిళా పిఎస్ డిఎస్పి ఆదినారాయణ, పెనుగొండ డీఎస్పీ నర్సింగప్ప, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పుట్టపర్తి సిపిఎం కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ వివక్షకు తావు లేని సమానత్వ సమాజం కోసం అంబేద్కర్ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి బ్యాల్లా అంజి, కొత్తచెరువు కార్యదర్శి ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి వెంకటేష్ పార్టీ సభ్యులు ప్రమీల ,నూర్జహాన్, శోభ, పుష్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జిఎల్ నరసింహులు ఆధ్వర్యంలో పలు కార్మిక సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముస్తాక్, బాబ్జాన్, రామాంజనేయులు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు శాంతిభాయి, హసీన్ తాజ్ మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుపాల్, బాలకృష్ణ, జనార్ధన్, చెన్నకృష్ణ వ్యవసాయ పరిశోధన కేంద్రం కార్మిక సంఘం నాయకులు రామ్మోహన్, గంగప్ప ఆటో యూనియన్ నాయకులు రఫీ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జనసేన పార్టీ ఇంచార్జ్ భైరప్రసాద్ జనసేన నాయకులు శివశంకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్లూమూన్ శివశంకర్, చలపతి ,రవికుమార్, జయవర్ధన్, చిన్నప రెడ్డి,అంజిబాబు,మహేష్ , లోకేష్, పలవర శ్రీనివాసులు, నాగరాజు,గణేష్,రామ్మోహన్, శివశంకర తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ అడుగుజాడలలో నడుద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. అంబేద్కర్ జయంతిని సోమవారం కదిరి పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో పిల్లలుతో కలిసి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డివిజన్ అధికారి బాలాజీ, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కళాజ్యోతి సర్కిల్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జేవి రమణ, టి. అయుబ్ ఖాన్, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎం బాబు. ముకుంద. లక్ష్మీ ఓబులేసు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక కళాజ్యోతి కూడలి లో వున్న బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సి పి ఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న ఎస్ హెచ్ భాష జెవి రమణ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ హైదరవల్లి వి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం జోన్ నాయకులు రామకృష్ణ నాయక్, ఆంజనేయులు, రామాంజినేయులుతదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని పలు బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టల్లో, తెలుగుదేశం కార్యాలయాలు, ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని సోమవారం నిర్వహించారు. పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి తెలుగుదేశం కార్యాలయంలో మాజీ సర్పంచి శ్రీ రామ్ నాయక్ తెలుగుదేశం మండల కన్వీనర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మయ్య, వెంకటాద్రి, కోట్లపల్లి జగన్ , రామయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద శ్రీ సత్యసాయి భగత్ సింగ్ ఆటో యూనియన్ నాయకులు మారుతి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి బ్యాల్ల అంజి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రంగప్ప ,ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : ఆధునిక నవ సమాజ నిర్మాణానికి పునాదులు వేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలు సాకే యశోద, మండల కన్వీనర్ మలిరెడ్డి, కురవ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు గంగాధర్, వెంకట రాముడు, సామకోటి ఆదినారాయణ, సుధీర్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. కొత్త చెరువులోని ధర్మవరం రోడ్డు నందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ శ్రీనివాసులు, మాజీ సర్పంచి మాణిక్యం బాబా, సామకోటి ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, ఓలిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు బేళ్ల అంజి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ముత్యాలు, కో కన్వీనర్ శంకర్ రెడ్డి, మహబూబ్ బాషా, షబానా, ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. అంబేద్కర్ వేడుకల సందర్భంగా సోమవారం అమడగూరు మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహం అవిష్కరణ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, కూటమి పార్టీ నాయకులుచ దళితులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నల్లమాడ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి స్థానిక దళిత సంఘం నాయకులు పాలాభిషేకం చేసి పూలమాలతో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులతో పాటు టిడిపి నాయకులు మైలేశంకర్, రామచంద్ర, పుట్టి నాగభూషణం తదితరులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వీఆర్ఏలు సర్వేర్లు నివాళులర్పించారు.

ఓబుల దేవర చెరువు : స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం పార్టీనాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎంపీడీవో, తాసిల్దార్ కార్యాలయంలో , అలాగే వశిష్ట స్కూల్ రెయిన్బో స్కూల్, శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం , విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్, తదితర కార్యాలయాలలో అంబేద్కర్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా ఓడిసిలోని అంబేద్కర్ సర్కిల్లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో గౌస్ లాజమ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అంబేద్కర్ సందర్భంగా ఆయన విగ్రహాన్ని సిపిఎం, సిపిఐ, ఎంఆర్‌పిఎస్ నాయకులు నివాళులు అర్పించారు.

పరిగి : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి మధుసూదన్ సోమవారం తన కార్యాలయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, సహాయ మేనేజర్లు ఉషారాణి, హరిత, ఖాజావలి, ఏఈ భాస్కర్ రెడ్డి, ఎస్ టి ఐ భాషా, ఎన్ఎంయు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి ఎస్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రవి నాయక్, మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న నాయకులు రంగారెడ్డి, సందీప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : అంబేద్కర్ జయంతిని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రభుత్వ అదికారులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సిపిఎం నాయకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ కు ఘన నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి మల్లికార్జున గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. టిడిపి, జనసేన నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ ఆశయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా కదిరి డివిజన్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సి తాహెర్ వలి, ఆజం బాషా, సునీల్ కుమార్, గౌస్ ఖాన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :అంబేద్కర్ ఆశయసాదనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి నియోజక వర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, వైసిపి సమన్వయ కర్త దీపికా వేణు రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలో వివిధ పార్టీలు, వామ పక్ష ప్రజా సంఘాల ఆద్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలయ్య పిఏ వీరయ్య, మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, టిడిపి నాయకులు పాల్గోన్నారు. వైసిపి ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దీపికతో పాటు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాలొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మేన్ రమేస్ కుమార్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు, పలువురు కౌన్సిలర్లతో పాటు ఎంఇ మోహన్, డీఈఈ. ఆనందరాజు, ఏఈలు జనార్ధన్, శంకర్, టిపిఎస్ అలివేలమ్మ, మేనేజర్ సుధాకర్, ఆర్ఐలు రాము, రామాంజినేయులు, ఇతర మున్సిపల్ ఉద్యోగులతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎనుకొండ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అందరికీ ఆరాధ్యుడేనని ఎంపి బికె.పార్థసారథి కొని యాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిపిఎం ఆధ్వర్యంలో.. ఆదర్శప్రాయుడు అంబేద్కర్ అని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో అంబే ద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. నాయకులు హరి, బాబావలి మాట్లాడు తూ ప్రతి పౌరుడు అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిం చాల్సిన బాధ్యత భారతీయులపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, ఆరిఫ్, మహబూబ్ బాషా, వెంకటరాముడు, సిఐటియు నాయకులు బావమ్మ, వెంకటేష్, నరసింహ, వెంకటేష్, తులసి, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : అంబేద్కర్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్య క్షులు గుండుమల తిప్పేస్వామి కొనియాడారు. వారు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం వంటి సిద్ధాంతాలపై ఆధారపడే నూతన సమాజానికి బాటలు వేసిన మహనీయులు అంబేద్కర్ అన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భక్తర్ సాబ్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, టిఎన్‌టియుసి అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్లు రాజా, ఉమాశంకర్, నాగేంద్ర, నాయకులు నరేష్‌కన్నా, సుబ్బరాయుడు, డాక్టర్ కృష్ణమూర్తి, ఈశ్వర్, తిమ్మరాజు, మార్కెట్ బాబు, గంగాధర్, వైబి.నాగరాజు, శంకర్, రమేష్, లాయర్ మారుతి, రవి, నారాయణ, మంజునాథ్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డీలర్లు పాల్గొన్నారు. ఎమ్మార్పీ ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ఆర్. నరసింహులు, తాలూకా అధ్యక్షులు గంగాధర్, గోవిందప్ప, ఎల్లోటి హనుమంతు పాల్గొన్నారు.